క్లుప్తంగా

ఈఓపీఆర్డీగా శ్రీనివాసులు


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసులు

దొర్నిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఈఓపీఆర్డీగా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. ఈయన నంద్యాల మండలం కానాల పంచాయతీ ఈఓగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న నాగఅనసూయ గోస్పాడు మండలానికి బదిలీపై వెళ్లారు. అనంతరం ఆయన ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ ధనుంజయుడు

దొర్నిపాడు: స్థానిక పశువైద్యాధికారిగా ధనుంజయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చిత్తూరు జిల్లాలోనియాద మరి మండలం మాదిరెడ్డి పల్లెలో పశువైద్యాధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ హరిత దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లడంతో ఉన్నతాధికారులు నూతన పశువైద్యాధికారిని నియమించారు.

పంచాయతీలకు పేటీఎం మిషన్లు


పంచాయతీ కార్యదర్శులకు మిషన్లు అందచేస్తున్న ఎంపీడీఓ

శిరివెళ్ల: పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ సుబ్రమణ్యం పేటీఎం పీడీఎస్ సౌండ్ మిషన్లు అందచేశారు. సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష, నగదు రహిత విధానంపై కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇక నుంచి పంచాయతీలలో నగదు రహిత విధానం అవలంబించాలన్నారు. ఇంటి పన్ను, నీటి పన్ను, ఇతర నగదు వసూళ్లు ఫోన్‌పే, ఏటీఎం కార్డుల ద్వారా చేపట్టాలని సూచించారు. 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను విజయవంతం చేద్దామన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్ర, హౌసింగ్ ఏఈ నాగేశ్వర్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ అనూష పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించాలి


బహుమతులు అందుకున్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల్లో విద్యతో పాటు నైతిక విలువలు పెంపొందించాలని ఉర్దూ సాహిత్య కమిటీ అధ్యక్షుడు అబ్దుల్‌సమ్మద్, అబ్దుల్‌అజీజ్ అన్నారు. సోమవారం ఉర్దూ పాఠశాలలో సిరతుల్ నబీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వంతో చదవాలన్నారు. విద్యతో పాటు క్రీడల్లో ముందుండాలన్నారు. ఉర్దూ పాఠశాలలో చదివే విద్యార్థులు మంచి మార్కులు సాధించి నంద్యాలకు పేరు తీసుకొని రావాలని ఆకాంక్షించారు. అనంతరం మద్యం, నాతియా ముఖాబీల ఉర్దూ పద్యం గేయ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో నూర్జహాన్, షమీమ్, బాను, పర్వీన్‌బాను, అసినాబేగ్ తదితరులు పాల్గొన్నారు.

28న కవి సమ్మేళనం

నంద్యాల(వ్యవసాయం): మహాకవి శ్రీగుర్రం జాషువా జయంతిని సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28న కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అరసం నంద్యాల జిల్లా అధ్యక్షుడు ముర్తుజాషేక్, కార్యదర్శి మద్దిలేటి సోమవారం తెలిపారు. ఈనెల 28వ తేదీ సాయిబాబానగర్‌లోని భగత్‌సింగ్ గ్రంథాలయంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. కవులు, రచయితలు సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి

నంద్యాల(న్యూటౌన్): జీపీఎస్ వద్దు.. పాత పెన్షన్ పునరుద్ధరించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని ఫ్యాప్టో, ఏపీసీపీఈఏ నాయకులు సుబ్బయ్య, ఫ్యాప్టో సెక్రటరీ ప్రసాద్, 1938 కార్యదర్శి శ్రీనివాసులు, చైర్మన్ మాధవస్వామి తెలిపారు. సోమవారం నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రంలో ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ 30సంవత్సరాలుగా ప్రభుత్వానికి, ప్రజలకు సేవ చేస్తే వృద్ధాప్యంలో భద్రత లేకుండా పోతుందని ఆరోపించారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, రామనరసింహ, శివారెడ్డి, కన్నయ్య, సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- పురుగుమందు పిచికారీలో జాగ్రత్తలు తప్పని సరి
- శరీరం నిండా దుస్తులు ధరించాలి
- ముఖానికి మాస్క్ ఉండేలా చూసుకోవాలి
- నిర్లక్ష్యంతో ప్రమాణానికే ముప్పు


వరి పొలానికి మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

గోస్పాడు: మండలంలో వరి పంటలో చీడపీడల నివారణకు రైతులు పురుగు మందులను పిచికారీ చేయడంలో బిజీగా ఉన్నారు. అయితే కొందరు కూలీలు, రైతులు కనీస జాగ్రత్తలను కూడా తీసుకోవడం లేదు. దీనివల్ల కొన్ని సందర్భాలలో ప్రాణాలను కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. పురుగు మందుల పిచికారీలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. ఒక్కోసారి ఎంత అప్రమత్తంగా ఉన్నా విష ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. మూడు రకాలుగా పురుగు మందులు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉందని చెబుతున్నారు.

6,661 హెక్టార్లలో వరిసాగు..

నంద్యాల మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 5026 హెక్టార్లు కాగా 3,668 హెక్టార్లలో సాగు అయ్యింది. అలాగే గోస్పాడు మండలంలో 4742 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం కాగా 2,993 హెక్టార్లు సాగు చేశారు. కాగా, ఇటీవల కురిసిన వర్షాలకు పైర్లకు చీడపీడలు ఆశిస్తుండటంతో రైతులు పురుగు మందుర పిచికారీ చేస్తున్నారు.

చర్మం ద్వారా శరీరంలోకి పురుగుమందు..

పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో విషం చర్మం నుంచి శరీరంలోకి ప్రవేశించే ప్రమాదముంది. శరీరంపై పుండ్లు, గాయాలు ఉంటే మరింత సులభంగా శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఆ తరువాత ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుంది.

ముక్కు ద్వారా...

క్రిమిసంహారక మందుల పిచికారీ ద్వారా వెలువడే వాయువులను పీల్చడం ద్వారా విషం శరీరంలోకి ప్రవేశించి హాని కలిగిస్తాయి. తరచూ ఇదే రకంగా పిచికారీ చేయాలి. పీలుస్తుంటే ముక్కుకు జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది.

నోటి ద్వారా...

పురుగు మందులు పిచికారీ చేశాక చేతులు శుభ్రం కడుక్కోకుండా ఆహార పదార్థాలు భుజిస్తే నోటి ద్వారా విష పదార్థాలు శరీరంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఒక్కొక్కప్పుడు మందు ప్రభావం ఎక్కువై మరణం కూడా సంభవిస్తుంది.

విషప్రభావానికి గురైతే ఇలా చేయాలి..

చర్మం ద్వారా విష పదార్థాలు శరీరంలోకి ప్రవేశిస్తే వెంటనే సబ్బు, మంచినీటితో శుభ్రంగా కడగాలి. ఒకవేళ కళ్లలో పడితే మంచినీటితో కడగాలి. చికిత్స కోసం వెంటనే దగ్గరలోని వైద్యుడిని సంప్రదించాలి. ముక్కుతో పీల్చితే విష ప్రభావానికి గురైన వ్యక్తిని గాలి, వెలుతురు బాగా వచ్చే ప్రదేశంలో ఉంచాలి. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటే వెంటనే కృత్రిమ శ్వాస అందించాలి. వీలైనంత త్వరగా వైద్యుని వద్దకు తీసుకువెళ్లి చికిత్స అందించే ఏర్పాటు చేయాలి. క్రిమిసంహారక మందు నోటి ద్వారా కడుపులోకి వెళితే వాంతి చేయించే మార్గాలను అన్వేషించాలి. గ్లాసుడు నీళ్లలో ఉప్పు లేదా ఆవాల పొడి కలిపి తాగించాలి.

తగిన జాగ్రత్తలతో ప్రయోజనం..

- మందులు పిచికారీ చేసే సమయంలో ముఖాన్ని పూర్తిగా గుడ్డతో కప్పుకోవాలి. కళ్లకు అద్దాలు పెట్టుకోవాలి. కొన్ని రకాల మందులు కళ్లలో పడితే కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది.
- మందులు పిచికారీ సమయంలో మద్యం తాగడం, చుట్ట, బీడీ, సిగరెట్ వంటివి పీల్చడం చేయరాదు.
- మధ్యాహ్నం సమయంలో ఎండవేడి ఎక్కువగా ఉన్నప్పుడు మందులు పిచికారీ చేయకూడదు.
- మందులు పిచికారీ చేసే సమయంలో వదులుగా ఉండే దుస్తులు ధరించాలి.
- గాలి వాటానికి ఎదురెళుతూ పొలంలో మందులు చల్లకూడదు.
- పురుగు మందులు పిచికారీ చేసిన తరువాత కాళ్లు, చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- మందు వినియోగించిన తర్వాత డబ్బాలు, కవర్లు భూమిలో గొయ్యి తీసి పాతి పెట్టాలి, లేదా నిప్పు పెట్టి కాల్చివేయాలి.
- మందులు పిచికారీ చేసే చేస్తున్నప్పుడు లేదా చేసిన తర్వాత ఎవరైనా విష ప్రభావానికి లోనై వాంతులు చేసుకుంటున్నా, కళ్లు తిరుగుతున్నట్టయితే, చర్మం బోయిన, దురదలు పెడుతున్నా వెంటనే వైద్యుడిని సంప్రదించి ప్రథమ చికిత్స చేయించుకోవాలి.

జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదం



ప్రస్తుతం పొలాల సాగులో భాగంగా రైతులు, రైతు కూలీలు పొలాల్లో ఎరువులు, పురుగు మందులను పిచికారీ చేస్తుంటారు. అలాంటి సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలకు గురి కావాల్సి వస్తుంది. ప్రతి ఒక్కరు ముఖానికి మాస్క్ ధరించడంతో పాటు ఎదురు గాలికి మందు పిచికారీ చేయకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి. ఏదైనా ఇబ్బంది అనిపిస్తే వెంటనే సంబంధిత వైద్యుల చికిత్స చేయించుకోవాలి.

–గోపాల్, పీహెచ్‌సీ వైద్యాధికారి, గోస్పాడు

మోతాదుకు మించి మందులు వాడకూడదు



క్రిమి సంహారక మందులు పిచికారీ చేసేటప్పుడు శరీరంపై నిండా దుస్తులు ధరించాలి. ముక్కు, నోటికి గుడ్డ మాస్క్ ధరించాలి. లేదా సేఫ్టీ సూట్ ధరించాలి. రైతులు ప్రతి ఏడాది పొలాల్లో వేసే మందులను పైర్లకు అనుగుణంగా వేయాలి. మోతాదుకు మించిన ఎరువు మందుల వాడకం పైర్లను కూడా దెబ్బతీసే అవకాశం ఉంది. మందుల పిచికారీ సమయంలో రైతులు తప్పని సరి నిబంధనలు పాటించాలి.

–స్వప్నికారెడ్డి, ఏఓ, గోస్పాడు

1,800 క్వింటాళ్ల విత్తనాలు మంజూరు

ఉయ్యాలవాడ : రైతులు రబీ సీజన్‌కు సంబంధించి మండలానికి 1,800 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలను ప్రభుత్వం కేటాయించిందని ఏఓ రాజేంద్రకుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విత్తనాల కోసం రైతు చెల్లించవలసిన వాటా, సబ్సిడీ విధి విధానాలు ప్రభుత్వం నుంచి అందవలసి ఉందన్నారు. శనగ విత్తనాలు కావాల్సిన రైతులు మండల పరిధిలోని 11 రైతు భరోసా కేంద్రాలలో ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ ప్రవేశ దరఖాస్తుకు 27వరకు గడువు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చేరే విద్యార్థులు మూడో విడత దరఖాస్తు చేసుకునేందుకు 27వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ సోమవారం తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏదైనా సమాచారం కోసం కళాశాలను సంప్రదించాలన్నారు.

ఐసీఐసీఐ బ్యాంకు ఇంటర్వ్యూలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం ఐసీఐసీఐ బ్యాంకు ఆధ్వర్యంలో డిగ్రీ విద్యావంతుల కోసం ఇంటర్వ్యూలను మేనేజర్ చల్లా రాజేష్ అధ్యక్షతన నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, ప్లేస్ మెంట్ ఆఫీసర్ ఇంతియాజ్ అహమ్మద్ ఇంటర్వ్యూల గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. బ్యాంకు గురించి సేల్స్, డిపాజిట్, పలు రకాల లోన్లు, డబ్బులు భద్ర పరుచుకొనే విధానం, బ్యాంకు యొక్క ముఖ్య ఉద్దేశాలను తెలియజేశారు.

వేగవంతంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే


చిన్నకంబలూరులో సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం వేగవంతంగా సాగుతోంది. రుద్రవరం, నర్సాపురం, ఆలమూరు పీహెచ్‌సీల పరిధిలో వైద్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకుంటున్నారు. సర్వే పూర్తవగానే ఆయా సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించి తగిన వైద్యం అందజేస్తామని ఆయా పీహెచ్‌సీల వైద్యులు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని చిన్నకంబలూరులో సాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రావణి పాల్గొని బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించి, వివరాలు తెలుసుకున్నారు.

'జగనన్నకు చెబుదాం' సమస్యలను పరిష్కరించండి

నంద్యాల: జగనన్నకు చెబుదాం – స్పందన సమస్యలపై వెంటనే స్పందించి అర్జీదారులు సంతృప్తి చెందేస్థాయిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ నలమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే అప్లోడ్ చేస్తే నిధులు విడుదల చేస్తామన్నారు. జగనన్నకు చెబుదాం 24 గంటల్లో పరిష్కరించాల్సిన ఆరు సమస్యలు ఉన్నాయని, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఈనెల 30వ తేదీ బనగానపల్లెలో నిర్వహించే స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ జాబ్ మేళా పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

పుష్పలతకు డాక్టరేట్



నంద్యాల(సిటీ): నంద్యాల వాసి కె.పుష్పలత సోమవారం జేఎన్టీయూ అనంతపురం వైస్ ఛాన్సలర్ జీ.రంగజనార్ధన చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 'బ్యాంక్ అస్స్యూరెన్స్ ఇన్ ఇండియా – ఏ స్టడీ ఆన్ ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టూ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' మీద చేసిన పరిశోధనలకు గాను పుష్పలతకు గౌరవ డాక్టరేట్ వచ్చింది. ఈమె ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో మేనేజ్మెంట్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఫార్మసిస్టులతోనే వైద్య రంగం బలోపేతం



మాట్లాడుతున్న డాక్టర్ మదన్‌మోహన్

నంద్యాలటౌన్: ఫార్మసిస్టులతోనే వైద్య రంగం బలోపేతమవుతుందని నంద్యాల సర్వజన ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మదన్ మోహన్ అన్నారు. సోమవారం స్థానిక కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫార్మాసిస్టులు కలిసికట్టుగా పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అదించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ శిరీష, ఫార్మసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిరంజన్ పాల్గొన్నారు.

30న జాబ్‌మేళా

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బనగానపల్లెలో ఈ నెల 30న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ అధికారి ప్రతాపరెడ్డి సోమవారం తెలిపారు. బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగబోయే ఈ జాబ్‌మేళాలో 22 కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లొమా, బీఫార్మసీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసి 18 నుంచి 30 ఏళ్ల మధ్య గల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులన్నారు. అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. మరింత సమాచారం కోసం 9440224291, 9705998056 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ధర్నా పేరుతో అంగన్‌వాడీ కేంద్రాల మూత


చెంచుగూడెంలో మూతబడిన అంగన్‌వాడీ కేంద్రం

చాగలమర్రి: తమ సమస్యల పరిష్కారానికి, తమ డిమాండ్లను సాధించుకోవటానికి కొన్ని అనుబంధ యూనియన్లతో కలిసి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సోమవారం చలో విజయవాడ ఆందోళన కార్యక్రమానికి వెళ్లడంతో మండంలోని అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. వాస్తవానికి ధర్నాకు మండలంలో ముగ్గురూ లేదా నలుగురు మాత్రమే వెళ్లారు. అయితే దీన్ని అదునుగా తీసుకున్న కొంత మంది కార్యకర్తలు ధర్నా కార్యక్రమానికి వెళ్లకపోయినా కేంద్రాలు తెరవకుండా, విధులకు హాజరు కాలేదు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న కార్యకర్తలు, ఆయాలపై చర్యలు తీసుకోనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు, శివబాలకృష్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, చలో విజయవాడ తరలి వెళ్తుంటే అరెస్టులు చేయడం తగదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో రవికుమార్, ప్రతాప్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ అనుబంధ సంస్థ అయిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, మహమ్మద్‌గౌస్, లక్ష్మణ్, వెంకటలింగం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అహోబిలేశుడి హుండీ కానుకల లెక్కింపు

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఎగువ అహోబిలం ఆలయంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు చేపట్టిన హుండీల లెక్కింపుతో రూ 37,77,620 ఆదాయం వచ్చినట్లు అహోబిలం దేవస్థానం అడ్మినిస్ట్రేషన్ అధికారి శివప్రసాద్ తెలిపారు. ఎగువ అహోబిలం దేవాలయ ఆవరణలో దేవస్థాన అధికారులు, వలంటీర్లు హుండీ కానుల లెక్కింపులో పాల్గొన్నారు.

ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం

నంద్యాల(సిటీ): పట్టణంలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నీసా అన్నారు. సోమవారం స్థానిక 23వ వార్డు నూనెపల్లెలో రూ.20లక్షలతో పైప్ లైన్, కల్వర్ట్ పనులకు భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు చేపట్టామని, పట్టణంలో అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ లక్ష్మీదేవి, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పార్థుడు, డీఈఈ జయభారత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయికి జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): చాబోలు గ్రామానికి చెందిన ఆకతాయికి రెండవ అదనపు జిల్లా జడ్జి రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేసినట్లు పోలీసు అధికారులు సోమవారం తెలిపారు. వివరాల మేరకు చాబోలు గ్రామానికి చెందిన ముల్లాగౌస్ అహమ్మద్ నంద్యాలలో కరెంట్ ఆఫీసు ఎదురుగా ఆదివారం రోడ్డున పోయే ఆడవారిని చూసి సైగలు చేస్తూ.. ఈలలు, కేకలు వేస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తుంటే టూటౌన్ పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా మూడు రోజులు జైలుశిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

దళిత రక్షణ యాత్ర

నంద్యాల(న్యూటౌన్): ఎస్సీ కార్పోరేషన్‌లో ఉన్న 26 రకాల పథకాలను అమలు చేయాలని కోరుతూ దళిత రక్షణ యాత్ర సోమవారం బైటిపేట నుంచి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, అధ్యక్షురాలు రంగమ్మ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దళితుల చట్టాలను అమలు చేయాలని, భూమిలేని పేద వారికి రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని, సబ్ ప్లాన్ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. దళితులకు 200యూనిట్ల నుండి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలన్నారు. ఈనెల 29వ తేదీన దళితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో జరిగే సదస్సును విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డేవిడ్, సుబ్బయ్య, సుబ్బరాయుడు, కేవీపీఎస్ నాయకులు జయమ్మలు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఈ-కేవైసీ పూర్తి చేయాలి

దొర్నిపాడు: ఖరీఫ్‌లో భాగంగా సాగుచేసిన పంటలను ఈనెలాఖరు లోగా ఈ-క్రాప్ నమోదు, ఈ-కై వైసీ పూర్తిచేయాలని ఏఓ సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా ఎవరైనా మిగిలిఉంటే ఈ-క్రాప్‌నమోదు చేయాలని వ్యవసాయసహాయకులకు సూచించారు. వరి, పత్తి, మిరప, మినుము తదితర పంటలు సాగుచేసివారు వెంటనే చేయించుకోవాలని, లేదంటే ప్రభుత్వ పథకాలను వర్తించవన్నారు.

ఆలయ స్థలం లీజుకు వేలం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రథమనందీశ్వర దేవస్థానం ఖాళీ స్థలం లీజు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. సర్వే నంబరు 453లోని మూడు ఎకరాల ఖాళీ స్థలాన్ని శనివారం 30వ తేదీన ఉదయం 11గంటలకు దేవస్థానం ఆవరణలో బహిరంగ వేలం పాట సంవత్సరం కాలపు లీజుకు వేలం వేస్తున్నట్లు వారు తెలిపారు. రూ.లక్ష డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు సెల్ : 9492405817కు సంప్రదించాలన్నారు.

సీఎంను కలిసిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. అమరావతిలో జరుగుతున్న శాసనసభ సమావేశాల సందర్భంగా విరామసమయంలో సీఎం కార్యాలయంలో ఆయనను కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండాలల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేయగా.. సీఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈయన వెంట విజయ డెయిరీ డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి ఉన్నారు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

గోస్పాడు: ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలోని నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని యాళ్లూరు సొసైటీ చైర్మన్ బెక్కెం రామసుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని యాళ్లూరు సీహెచ్‌సీ ఆసుపత్రిలో సోమవారం స్థానిక వైద్యులు ప్రశాంత్, రాజేష్, శివాణీ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భవ హెల్త్ మేళా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పేద ప్రజల కోసం ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని గ్రామాల్లోనే అందించాలన్న లక్ష్యంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు చాబోలులో జగనన్న ఆరోగ్య సురక్ష పైలెట్ ప్రాజెక్టు

నంద్యాల(అర్బన్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద నంద్యాల మండలం చాబోలు గ్రామాన్ని జిల్లా అధికారులు ఎంపిక చేశారు. ఈ మేరకు మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామంలోని జెడ్పీహెచ్ పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్లు, సిబ్బంది హాజరు కానున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్య క్రమాల్లో ప్రతిభ చూపాలని జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖాధికారి సత్యనారాయణ అన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి వ్యాసరచన, పేయింటింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన వారికి ఈ నెల 27న ప్రపంచ పర్యాటక వేడుకల సందర్భంగా కలెక్టర్ చేతులమీదుగా బహుమతులు అందజేస్తామన్నారు.

డి.కొత్తపల్లెలో 104 సేవలు

చాగలమర్రి: మండలంలోని డి.కొత్తపల్లి గ్రామంలో వైద్యులు శివమోహన్ సోమవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 120 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పల్లవి, ఆశ కార్యకర్త పుష్పలత, హరి, హెల్త్ అసిస్టెంట్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆళ్లగడ్డ: మండలంలోని కోటకందుకూరు గ్రామానికి చెందిన పంబ ఎలీషా (40) అనే వ్యక్తి కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు రూరల్ ఎస్ఐ నరసింహులు సోమవారం తెలిపారు. మద్యానికి బానిస కావడంతో పాటు అప్పులు అధికం, కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందాడు. భార్య ప్రేమకుమారి అవసరం నిమిత్తం పుట్టింటికి వెళ్లగా సోమవారం తెల్లవారు జామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసికొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కూతరు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజునాయక్

నంద్యాల(అర్బన్): వెలుగోడు మండలం జెమ్మినగర్ తండా వాసులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు తాండ వాసులతో కలిసి ఆయన వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో తాండ వాసులు లక్ష్మానాయక్, విక్రమ్‌నాయక్, నగేష్‌నాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ఉయ్యాలవాడ : జగనన్నకు చెబుదాం సంబంధించి పెండింగ్‌లో వున్న దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేలా మండల స్థాయి అధికారులు బాధ్యతగా పని చేయాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన సమస్యలను అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో గడువులోగా పరిష్కరించాలన్నారు. పుచ్చకాయలపల్లె గ్రామానికి చెందిన కాకనూరు సతీష్‌కుమార్‌రెడ్డి తమ గ్రామ దత్తాత్రేయ స్వామి మాన్యం భూమి 772 సర్వే నంబర్‌లో 2.74 ఎకరాలు ఆక్రమణకు గురైందని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: వివిధ సమస్యలకు పరిష్కారం కోరుతూ కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ జయప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా క్రిష్టిపాడు గ్రామానికి చెందిన గోసుల చిన్నగురుమూర్తి అనే రైతు తనకు పొలం ఉందని అన్నదమ్ముల భాగపరిష్కారాల కారణంగా ఆన్‌లైన్‌లో లేదని విచారించి నూతన పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశాడు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ తదితరులు పాల్గొన్నారు.